బోనాలకు వేళాయె..!

- 26న గోల్కొండ బంగారు బోనంతో షురూ
- 29న విజయవాడ కనక దుర్గమ్మకు బోనం
- అక్కన్న మాదన్న ఆలయం నుంచి భాజాభజంత్రీలతో భక్తులు
- ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు


చార్మినార్: నగరంలో ఆషాఢమాసం బోనాల జాతరకు వేళయ్యింది. ఈనెల 26న గోల్కొండ అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ఉత్సవాలు ప్రారంభమై వచ్చే నెల 21న పాతబస్తీలో నిర్వహించే అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపుతో ముగియనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 29న విజయవాడ కనక దుర్గా అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కోరుతూ భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని వివిధ దేవాలయాలకు చెందిన ప్రతినిధుల బృందం విజయవాడ కనక దుర్గమ్మ దేవస్థానం ఈవో సీనా నాయక్‌కు బుధవారం వినతి పత్రం అందజేసింది. కలిసిన వారిలో జనగామ మధుసూదన్ గౌడ్, మల్యాల మధుసూదన్ యాదవ్, రాందేవ్ అగర్వాల్, దత్తాత్రేయ, జి.దినేశ్, చేతన్ సూరి, గట్టు శ్రీనివాస్, బుచ్చన్న, సాత్విక్ తదితరులు ఉన్నారు.

గంగ తెప్పకు పూజలు.. దుర్గమ్మ తల్లికి బంగారు పాత్రలో నైవేద్యం

ఈనెల 29న హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయం నుంచి బాజాభజంత్రీలతో కళా బృందాలు, పోతరాజుల నృత్య ప్రదర్శనలు నిర్వహించి విజయవాడకు బయలుదేరనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. ముందుగా అక్కన్న మాదన్న ఆలయంలో అమ్మవారి వద్ద బంగారు పాత్రకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయవాడ బయలుదేరి వెళ్లనున్నామన్నారు. విజయవాడ బ్రాహ్మణ వీధి నుంచి కనక దుర్గమ్మ ఆలయం వరకు కళా బృందాల నృత్య ప్రదర్శనలతో సామూహిక తెలంగాణ బోనాల జాతర ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో పాటు పాడి పంటలు పచ్చగా ఉండాలని కోరుతూ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈయేడు కూడా కృష్ణా నదిలో గంగ తెప్పకు పూజల అనంతరం బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, నైవేద్యాన్ని సమర్పించనున్నామని తెలిపారు. ఈయేడు విజయవాడలో జోగిని శ్యామల బంగారు బోనాన్ని ఎత్తనున్నట్లు పేర్కొన్నారు.



విజయవాడ కనక దుర్గమ్మ ఆలయ ఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఉమ్మడి ఆలయాల ప్రతినిధులు



ఈయేడు బోనాల జాతర వివరాలు

- ఈనెల 26న గోల్కొండ అమ్మవారి బోనాలతో ప్రారంభమవుతున్నాయి.
- జూలై 13న, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు.
- అదే రోజు పాతబస్తీలో అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు.
- శాలీబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ఊరేగింపు.
- లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకనున్నారు.
- 20న పాతబస్తీతో పాటు నగరంలోని అన్ని ప్రాంతాల్లో బోనాలు.
- 21న పాతబస్తీలో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు.

సప్త మాతృకల–సప్త బంగారు బోనాలు

ఈసారి సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలను నగరంలోని గోల్కొండ, విజయవాడ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ తల్లి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం, చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయం, లాల్‌దర్వాజా సింహవాహినీ ఆలయం అమ్మవార్లకు సమర్పించనున్నారు. ఇందుకోసం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. 26న, గోల్కొండ జగదాంబ అమ్మవారికి నిర్వహించే బంగారు బోనాలతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. రెండో బంగారు బోనం విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి సమర్పించనున్నారు.

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా వెంకటరమణ



అబిడ్స్: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా డాక్టర్ వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రార్, సెక్రటరీ అనిల్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట రమణ 5 ఏళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఫార్మసీ టీచర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న వెంకటరమణ రెండోసారి ఫార్మసీ కౌన్సిల్‌కు సభ్యుడిగా నామినేట్ అయ్యారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్



విజయనగర్‌కాలనీ: విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. విజయనగర్‌కాలనీ గిల్డ్ ఆఫ్ సర్వీస్ సేవా సమాజం బాలిక నిలయంలో విద్యార్థిని ఆకర్షణ సతీశ్ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. చదువుతో సెల్ఫ్ రెస్పెక్ట్ పెరుగుతుందన్నారు. ఎంచుకున్న లక్ష్యాలు చేరుకోవలంటే ఇప్పటి నుంచే కృషి, పట్టుదలతో చదవాలని సూచించారు. పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నాయని మంచిగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలిక సదన్ చైర్‌పర్సన్ భారతీదేవి, ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ విజయ శ్రీనివాస్‌తో పాటు బాలిక సదనం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం

గోల్కొండ: కార్వాన్ సబ్జిమండీలోని నల్లపోచమ్మ, మాత మహంకాళి దేవీ బోనాల ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా దోర్నల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం బోనాల ఉత్సవాల నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. గౌరవ సలహాదారులుగా కట్ట రాజయ్య, గూడబోయిన శివరత్నం, కట్ట శివరాజ్, జె.వేణు, వేణుకుమార్‌గౌడ్, కట్ట నర్సింగ్‌రావు, ఏ.శ్యాంసుందర్, గుడుమని అశోక్‌కుమార్, జి.నిరంజన్‌బాబు, యాట నందకిశోర్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే బోనాలకు గుర్తింపు

గోల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే తెలంగాణ బోనాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈనెల 26న గోల్కొండ రిసాల బజార్ నుంచి నిర్వహించే బోనాల జులూస్‌కు హాజరుకావాలని కోరుతూ వృత్తి పని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి బుధవారం ఆమెకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ఖరారు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేశ్‌చారి, బండారి మహేందర్ ముదిరాజ్, కొట్టాల యాదగిరి ముదిరాజ్, బండారి నాగేందర్, ప్రశాంత్ కుమార్, కడారి రఘు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ కవితతో బీఆర్‌ఎస్ నేతలు పప్పు మాత్రే, ప్రశాంత్ శర్మ

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు పప్పు మాత్రే, ప్రశాంత్ శర్మ, శ్రీనివాస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. వ్యాపారులు, స్థానికులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


ఉద్యోగుల ప్రగతి కోసమే టీఎన్జీఓస్ యూనియన్



వేడుకల్లో మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్, ఏలూరు శ్రీనివాసరావు

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి కోసమే టీఎన్జీఓస్ కేంద్ర సంఘం కృషి చేస్తున్నదని కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి బుధవారం బోనాలు సమర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తమ యూనియన్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రంకుమార్, ప్రధాన కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఇతర సభ్యులు బాల్‌రాజ్, కొండల్‌రెడ్డి, పర్వతాలు, శైలజ, సుజాత ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



అబిడ్స్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించేలా కృషి చేయాలని ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆచార్య కొండ రామచంద్రారెడ్డి సూచించారు. అబిడ్స్ కట్టెలమండిలోని ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాలకు ఉచితంగా సోలార్ పవర్ సిస్టంను అందించిన పూర్వ విద్యార్థిని రాంప్రసాద్ బుధవారం ఆయన సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత స్థానాల్లో నిలబడి ఏవీ పాఠశాల పేరు ప్రఖ్యాతలను నిలబెడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.వివేకన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, కెనరా బ్యాంక్ ఏజీఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు హేమ, మంజుల, సునీత, జ్యోతి, ప్రియ, కవిత, సంగీత పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లేవి..?



గోల్కొండ కోటలో పర్యటిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

- సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- జీహెచ్ఎంసీ అధికారుల పనితీరుపై ఆగ్రహం

లంగర్‌హౌస్: బోనాల ఉత్సవాల ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందని, ముఖ్యంగా జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సందర్భంగా గోల్కొండ కోటలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల వివరాలను గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ కొండెపుడి చంటిబాబును అడిగి తెలుసుకున్నారు. ఓ వైపు సమావేశాలు నిర్వహిస్తుంటే జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ, డీఎంహెచ్ఓ అధికారులు హాజరుకాకపోవడంపై మండిపడుతూనే జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు మంత్రికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.


రేపటి నుండి సమన్వయంతో పని చేయాలి

బోనాల ప్రారంభానికి తక్కువ సమయం ఉందని ఆర్డీ కార్యాలయంతో పాటు అన్ని శాఖల వారు గోల్కొండలో ఏర్పాట్లు చేయాలన్నారు. కోటపైకి వెళ్లేందుకు ర్యాంపు మరమ్మతులు చేపట్టాలని మంత్రి హెచ్చరించినా పనులు ప్రారంభించలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ చంటిబాబు సూచన మేరకు గతంలో తేనెటీగల దాడి వల్ల 48 మందికి గాయాలయ్యాయని, చెట్లు, గోడలకు అలాంటివి ఉంటే ముందే తొలగించాలన్నారు. అనంతరం ఆమె నాగదేవత పుట్ట, మొదటి మెట్టు వరకు వెళ్లి పూజలు చేసి ర్యాంపును పరిశీలించారు.

శివసత్తులు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండండి

బోనాల సందర్భంగా గోల్కొండతో పాటు అన్ని ఆలయాల వద్ద శివసత్తులు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అదనపు పోలీస్ కమిషనర్ విక్రం సింగ్ మాన్ సూచించారు. గోల్కొండ బోనాల ముఖ్య రోజుల్లో 14 ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. అధికారులు కూడా వారికి కేటాయించిన ప్రాంతాల్లో వాహనాలు పార్కు చేసి గోల్కొండ కోట వద్దకు నడిచిరావాలని సూచించారు. అన్ని శాఖలకు సంబంధించి 4 ప్రాంతాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మిమీషనర్ వెంకటరావు, వివిధ శాఖల అధికారులు చంద్రమోహన్, వెంకట్‌రెడ్డి, వసంత, అహల్య, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌కు శుభాకాంక్షల వెల్లువ




మంత్రిని సన్మానిస్తున్న అరుణ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి వివేక్ వెంకటస్వామిని రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కలిసి మంత్రిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బొమ్మరాజు కృష్ణమూర్తి, నవీన్ ముదిరాజ్, ధన్‌రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట: రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జి.వివేక్ వెంకట స్వామిని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఆడాల శివ కుమార్ ఆయన కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే కార్మిక, కర్షకులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: ఓం కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.కె.రాజు రాష్ట్ర మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నేతలు మైని నామ్‌దేవ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ప్రవాహ–2025’



ప్రారంభిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వీసీ ప్రొఫెసర్

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో ప్రవాహ–2025 పేరిట బుధవారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంగాధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు సినిమా, టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.మధుకర్, ఎస్‌పీఏ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోమటిరెడ్డి మైపాల్‌రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త చిన్న సైదులు, రామకృష్ణతో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడులు

సంతోష్‌నగర్: పిసల్‌బండలోని వ్యభిచార స్థావరంపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సంతోష్‌నగర్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పిసల్‌బండలోని ఓ నివాసంలో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నార న్న విశ్వసనీయమైన సమాచారం మేరకు దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, సంతోష్‌నగర్ పోలీసులు దాడులు చేసి ముగ్గురు మహిళలు, ఓ విటుడిని అదుపులోకి తీసకుని స్కూటీని స్వాధీ నం చేసుకున్నారు. వీరిని తదుపరి విచారణ కోసం సంతోష్‌నగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం కేంద్రంలో చోరీకి విఫలయత్నం



సంతోష్‌నగర్: ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటక్ మహేంద్ర బ్యాంక్ ఏటీఎం కేంద్రంలోకి బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని దుండుగులు ప్రవేశించారు. నగదు ఉంచే బాక్స్ ఓపెన్ కాకపోవడంతో అక్కడి నుంచి దుండగులు పారిపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఐ.ఎస్.సదన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హష్ ఆయిల్, గంజాయి పట్టివేత

నాంపల్లి: గంజాయి, హష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాను మాసబ్‌ట్యాంక్ పోలీసులు పట్టుకుని వారి నుంచి 375 ఎంఎల్ హష్ ఆయిల్, 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ పెన్షన్ ఆఫీస్ సమీపంలోని పటేల్ రెసిడెన్సీలో నివాసం ఉండే ఫైజాన్, ముర్తుజాకు ఐడీపీఎల్ కాలనీకి చెందిన సమీర్, హర్షిత్ అనే యువకులు 5 ఎంఎల్ క్వాంటిటీ గల రెండు చిన్న బాటిల్స్‌ను తీసుకుని విక్రయించేందుకు వచ్చారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీరిని పెన్షన్ ఆఫీస్ వద్ద సోదాలు చేయగా హష్ ఆయిల్ లభించింది. దీంతో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా గాజులరామారానికి చెందిన విజయ్, అజయ్, వీరాచారి, చింతల్‌కు చెందిన ఒక అమ్మాయి నుంచి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నారు. దీంతో వీరిని అదుపులోకి తీసుకుని 5 ఎంఎల్ సామర్థ్యం గల 71 హష్ ఆయిల్, ఫైజాన్, ముర్తుజా దగ్గర 2 హష్ ఆయిల్, సమీర్, హర్షిత్ వద్ద 2 హష్ ఆయిల్ చిన్న బాటిల్స్, అలాగే చింతల్‌కు చెందిన అమ్మాయి వద్ద 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఈఎస్ఐ యూనిట్ నూతన కార్యవర్గం ఏర్పాటు



నియామకపు పత్రాలు ఇస్తున్న సత్యనారాయణ

నాంపల్లి: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా ఈఎస్ఐ యూనిట్ నూతన కార్యవర్గం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ సమక్షంలో బుధవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా పి.ఓం ప్రభు, సహాధ్యక్షుడిగా వై.పురుషోత్తం, కార్యదర్శిగా ఒ. శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎం.మహేంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా పి.నరసింహ, పి.శ్రీకాంత్, ఎస్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.వెంకటరాములు, బి.మహేశ్, కార్యాలయ కార్యదర్శిగా ఆర్.వనజ లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.దుర్గా ప్రసాద్, సీహెచ్.సాయి చరణ్, కార్యవర్గ సభ్యులుగా షమీన్, బి.నిహాల్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగనున్నది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు కేంద్ర, జిల్లా సంఘం నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శాస్త్రీయ కళలను కాపాడుకోవాలి



గన్‌ఫౌండ్రీ: ఎస్ఎన్‌కే ఫైనార్ట్స్ స్కూల్ 35వ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు శిష్య పరంపర పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీమాన్ ప్రణవానంద ప్రభుజీ మాట్లాడుతూ.. నేటి యువతకు శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... 35 ఏళ్లుగా చిన్నారులకు నాట్య కళలు నేర్పించడం అభినందనీయమన్నారు. అంతకుముందు పలువురు నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌జీయూకేటీ (బాసర) వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ ఇన్‌ఫ్యాక్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంప నాగేశ్వర్‌రావు, రచయిత చినుకు మూర్తి మిమిక్రీ రమేశ్, సంస్థ వ్యవస్థాపకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్, డాక్టర్ పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్



ఎమ్మెల్యే మేరాజ్ హుస్సేన్‌తో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

చార్మినార్: లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ లో ముంపునకు గురైన ప్రాంతాలను యాకుత్ పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లో వరద నీటిని పంపింగ్ చేసి ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని మెయింటనెన్స్ సీఈని ఆదేశించారు. వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు శాశ్వత చర్యల కోసం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డి, డిసి మంగతాయారు, సీఈ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ వసీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తాం



ప్రముఖులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతిలో శాంతికృష్ణ సేవా సమితి 40వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని 1111వ అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జానపద కళలకు ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. బతుకమ్మ తల్లి జన్మస్థలమైన చౌటపల్లి గ్రామంలో 40 ఏళ్ల క్రితం ప్రారంభమై అనేక దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. 2 రోజుల పాటు సాగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ దాసోజి శ్రవణ్, జాతీయ బీసీ కమిషన్ టి.ఆచారి, వంశీ కళా సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, ఏసీపీ కె.ఎం.కిరణ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు శాంతి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.